ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల
జిల్లా వార్తలు

5★★

బుధవారం 10 జనవరి 2024

అడ్డదారిలో ధాన్యం కేటాయింపు 8లో..

సాగు నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి 8లో..

జిల్లాలో పెరిగిన ఓటర్లు

- ముసాయిదా జాబితా విడుదల చేసిన అధికారులు
- అభ్యంతరాలపై ఈనెల 21వ తేదీ వరకు అవకాశం
- నమోదుతో పాటు మార్పులు, చేర్పులు
- ఈనెల 20, 21వ తేదీల్లో ప్రత్యేక నమోదు
- వచ్చే నెల 8వ తేదీన తుది జాబితా



రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముసాయిదా జాబితాను అందిస్తున్న కలెక్టర్

జగిత్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నిమిత్తం ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ముసాయిదా (డ్రాఫ్ట్)ను అధికారులు విడుదల చేశారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో అధికారులు ప్రకటించిన దాని ప్రకారం జిల్లాలోని మూడు నియోజక వర్గాల్లో కలిపి 7,00,315 మంది ఓట ర్లున్నారు. జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా స్వీప్ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయడంపై అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు అంద జేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల కంటే ప్రస్తుతం ప్రకటించిన ముసాయిదా జాబితాలో జిల్లా వ్యాప్తంగా 1,112 మంది ఓటర్లు పెరిగారు. నిర్ణీత తేదీలోగా తుది ఓటరు జాబితాను ప్రకటించడానికి అధికారులు సమాయత్తం అవుతున్నారు.

కొత్తగా యువ ఓటర్ల నమోదుకు కటాఫ్ తేదీలు..

జిల్లాలో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాల నుకునే యువత కోసం ఎన్నికల సంఘం కటాఫ్ తేదీలను ప్రకటించింది. జనవరి 1వ తేదీ, ఏప్రి ల్ 1వ తేదీ, జూలై 1వ తేదీ, అక్టోబర్ 1వ తేదీ 2024 నాటికి 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయనున్నారు. ఇందుకు అన్ని వర్గాలు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

ముసాయిదా ప్రకారం ఓటరు జాబితా ...

జిల్లాలో అధికారులు ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకారం జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7,00,315 మంది ఓటర్లున్నారు. ఇందులో 3,62,175 మంది మహిళలు, 3,38,108 మంది పురుషులు, 30 మంది ఇతరులున్నారు. 200 మంది సర్వీసు ఓటర్లు నమోదు అయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల నాటికి ఉన్న ఓటర్ల కంటే ప్రస్తుతం 1,112 మంది ఓటర్లు పెరిగారు. ఇందులో 921 మంది మహిళలు, 191 మంది పురుషులు పెరిగారు. కోరుట్ల నియోజకవర్గంలో 2,41, 309 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 1,15,137 మంది పురుషులు, 1,26, 169 మంది మహిళలు, ముగ్గురు ఇతరులున్నారు. . ధర్మపురి నియోజకవర్గంలో 2,26,901 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 1,11,140 మంది పురుషులు, 1,15,755 మంది మహిళలు, ఆరుగురు ఇతరులున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 2,32,103 మంది ఓటర్లు ఉండగా, ఇం దులో 1,11,831 మంది పురుషులు, 1,20,251 మంది మహిళలు, 21 మంది ఇతరులున్నారు. 224 మంది సర్వీసు ఓటర్లున్నారు.

మార్పులు, చేర్పులకు అవకాశం...

ఓటరు ముసాయిదా జాబితా ప్రకటించిన తర్వాత ఓటు నమోదు చే సుకునే అవకాశం ఉంది. జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవచ్చును. దీంతో పాటు పేర్లలో తప్పులు, ఇంటి చిరునామా మార్పు, తొలగింపు, పోలింగ్ స్టేషన్ మార్పు, ఇంకా ఏమైనా పొరపాట్లు ఉంటే వాటిని సరి చేసుకోవచ్చును. ముసాయిదా జాబితాలో పేరు లేని వారు ఫారం-6లో వివరాలు నమోదు చేసుకొని ఆన్‌లైన్ ద్వారా గానీ, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులను అందించాల్సి ఉంటుంది.

ఎన్ఆర్ఐ ఓటర్ల స్పందన అంతంతే...

రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్ఆర్ఐ (నాన్ రెసిడెన్సి ఆఫ్ ఇండియా) ఓటర్లను ప్రత్యేకంగా పేర్కొంది. గతంలో సదరు ఓటర్లకు ప్రత్యేక ఫారం - 6ఏ రూపొందించిన సంగతి తెలిసిందే. రానున్న ఎన్నికల్లో వీరు కూడా ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎన్ఆర్ఐ ఓటర్ల వివరాలను ప్రత్యేక నమూనాలో పొందుపరిచింది. జిల్లా నుంచి వేల సంఖ్యలో దుబాయి, మస్కట్, సౌదీ అరేబియా, సింగపూర్, బె హ్రయిన్, రష్యా, అమెరికా, లండన్, స్విట్జర్లాండ్, కెనెడా తదితర దేశాల్లో వేల సంఖ్యలో ఉన్నారు. సుమారు 30 శాతం అక్కడే స్థిర పడగా ఉపాధి నిమిత్తం అక్కడున్నవారు రాకపోకలు సాగించే వారు సుమారు 70 శాతం వరకు ఉన్నారు. జిల్లాలో ఓటరు జాబితాలో నమోదు చేసుకున్న వారు స్వల్ప సంఖ్యలోనే ఉండడం పరిస్థితికి అద్దం పడుతోంది.

పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందిస్తాం

షేక్ యాస్మిన్ బాషా, కలెక్టర్



రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా ఓటరు జాబితాను రూపొందిస్తున్నాము. ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించాము. సదరు ముసాయిదా ఓటరు జాబితాను రాజకీయ పార్టీ ప్రతి నిధులకు అందజేశాము. దీనిపై అభ్యంతరాలను నిర్ణీత తేదీల్లోపు స్వీకరించనున్నాము. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సైతం నిర్వహిస్తున్నాము. స్వీప్ కార్యక్రమాన్ని మరింత ముమ్మరం చేస్తాము. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు అభ్యంతరాల పరిశీలన తదితర వాటిని నిర్వహించిన అనంతరం ఫిబ్రవరి 8వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రకటించడానికి చర్యలు తీసుకుంటున్నాము.

ఈనెల 20, 21వ తేదీల్లో ప్రత్యేక నమోదు..

ఈనెల 21, 21వ తేదీల్లో పోలింగ్ బూత్‌ల వారీగా ప్రత్యేక ఓటు నమో దు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్ ఓ)లు రెండు రోజుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు వారికి కేటా యించిన కేంద్రాల్లో అందుబాటులో ఉంటారు. ఓటరు జాబితాపై అభ్యం తరాలు ఉంటే కూడా ప్రత్యేక నమోదు కార్యక్రమంలో ఇచ్చే అవకాశాన్ని కల్పించారు.

ఫిబ్రవరి 8వ తేదీన తుది ఓటరు జాబితా..

జిల్లాలో అధికారులు విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తహసీల్దార్ కార్యాలయాల్లో ఇవ్వవచ్చును. ఇందుకు ఈనెల 21వ తేదీ వరకు అవకాశం ఉంది. బోగస్ ఓట్లు ఉన్నాయని ఎన్నికల సమయంలో ఆందోళనలు చేపట్టేకన్నా ఇప్పుడే సరిచేసుకుంటే ఉత్తమమని అధికారులు సూచిస్తున్నారు. వచ్చిన అభ్యంతరాలను గడువు ముగిసిన తేదీ నుంచి నిర్ణీత తేదీల్లోపు పరిశీలన జరిపిన తదుపరి అధికారులు పరిష్కరిస్తారు. ఫిబ్రవరి 8వ తేదీన తుది ఓటరు జాబితాను అధికారులు ప్రకటిస్తారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీల అవిశ్వాసం మలుపు

- గైర్హాజరైన సభ్యులు
- ఫలించిన బీఆర్ఎస్ వ్యూహం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో నర్సింహమూర్తి

వెల్గటూర్, జనవరి 9: వెల్గటూర్ మండల మండల పరిషత్ అధ్యక్షురాలు కూనమల్ల లక్ష్మి, ఉపాధ్యక్షురాలు ముస్కు కవితలపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం మంగళవారం మలుపు తరిగింది. మండలంలోని 15 మంది ఎంపీటీసీ సభ్యులు ఎవరూ ప్రత్యేక సమావేశానికి సభ్యులు ఎవరూ హాజరు కాలేదు. అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో నర్సింహమూర్తి ప్రకటించారు. గత నెల 11న పది మంది ఎంపీ టీసీలు సంతకాలు చేసి ఎంపీపీ లక్ష్మి, వైస్ ఎంపీపీ కవితలపై అవిశ్వాస తీర్మాన నోటీసును ఆర్డీవోకు అందజేశారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించిన క్రమంలో ఎంపీడీవో సంజీవ్‌రావు ఏర్పాట్లు చేశారు. ఉదయం గం.10.30 లకు వైస్ ఎంపీపీ కవితపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చించడానికి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి 15 మంది సభ్యులలో ఎవరూ హాజరు కాలేదు. మధ్యాహ్నం గం.12.30 లకు ఎంపీపీ లక్ష్మి పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చించడానికి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కూడా సభ్యులు ఎవరూ హాజరు కాలేదు. దీనితో ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ఆర్డీవో నర్సింహమూర్తి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు శేఖర్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

● వెల్గటూర్ ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై పది మంది సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మలుపు తిరిగింది. కాంగ్రెస్ చేసిన క్యాంప్ రాజకీయ మంత్రాంగం ఫలించలేదు. కొందరు ఎంపీటీసీలు చివరి క్షణంలో మొండి చేయి చూపడంతో చివరికి కాంగ్రెస్ ఆశలు అడియాశలు అయ్యాయి. ఎత్తులకు పై ఎత్తులు వేసిన బీఆర్ఎస్ వ్యూహం ఫలించడంతో సమావేశానికి సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. తీర్మానం ప్రవేశపెట్టిన సభ్యులే సభకు హాజరుకాకపోవడం వెనుక లాబీయింగ్ జరినట్లు చర్చ జరుగుతోంది. మొత్తానికి జిల్లాలో మొట్ట మొదటి అవిశ్వాస తీర్మానం వీగిపోవడంతో బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

విదేశీ ఉద్యోగాల డ్రైవ్‌కు విశేష స్పందన

జిల్లా ఉపాధి కల్పనాధికారి సత్తెమ్మ

జగిత్యాలఅర్బన్, జనవరి 9: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ఆధ్వర్యంలో నిర్వహించిన విదేశీ ఉద్యోగాల డ్రైవ్‌కు విశేష స్పందన లభించిందని జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్తెమ్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో ఇజ్రాయెల్ దేశంలో ఉద్యోగాల భర్తీకి మంగళవారం జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో, టామ్ కామ్ సహకారంతో ఎన్‌రోల్ మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్మాణ కార్మికులు, షట్టరింగ్ కార్పెంటర్‌లు, సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, ఐరన్ బెండింగ్ పనులకు డిమాండ్ ఉందన్నారు. ఈ డ్రైవ్‌లో 1000 ఉద్యోగాల భర్తీకి ఎంపిక ప్రక్రియ జరగగా, 800మంది డ్రైవ్‌కు హాజరైనట్లు ఉపాధి కల్పన అధికారిణి సత్తెమ్మ తెలిపారు. ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్న ఈ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టామ్‌కామ్ మేనేజర్ అనిల్ కుమార్, ఎంప్లాయిమెంట్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ లింగమూర్తి, జూనియర్ అసిస్టెంట్ సదానందం, సిబ్బంది శిరీష్ తదితరులున్నారు.

'ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ 68 శాతం పూర్తి'

జగిత్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ 68 శాతం పూర్తయిందని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర అన్నారు. మంగళవారం మండల, డివిజన్, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో ప్రజా పాలన డేటా ఎంట్రీపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. డేటా ఎంట్రీ పకడ్బందీగా, తప్పులు లేకుండా పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,32,601 దరఖాస్తులకు గాను 2,24,896 దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తయిందన్నారు. ఇంకను 1,07,705 దరఖాస్తులను పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓలు నర్సింహమూర్తి, రాజేశ్వర్, డీపీఓ దేవరాజ్, పలువురు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

జగిత్యాలరూరల్, జనవరి 9 : జగిత్యాల మండలం హస్నాబాద్ శివారులో మంగళవారం ఆటో అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలో నలుగురికి స్వల్పగాయాలు కాగా, మహేష్, లక్ష్మీలకు తీవ్రగాయాలైనవి. ఆటో ప్రయాణికులను ఎక్కించుకొని జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ నుంచి జగిత్యాల వైపు వస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తాపడింది. సమాచారం అందుకున్న పోలీసులు గాయపడ్డవారిని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

రాయికల్, జనవరి 9: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కామని లక్ష్మణ్, వేముగంటి గిరిధర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వెంకటరమణి, సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జక్కుల రాజేంద్రప్రసాద్, నాయకులు ముత్యంరెడ్డి, మహేందర్, ఉపాధ్యాయులు నర్సయ్య, శ్రీను, రాజారెడ్డి, రామస్వామి, చిన్నయ్య, మహేష్, కార్తీక్, శ్రీను, గంగరాజం, గంగాధర్, పాల్గొన్నారు.

నేడే కిసాన్ మేళా

జగిత్యాలఅర్బన్, జనవరి 9: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం(పొలాస)లో ఈ నెల 10 బుధవారం రోజున కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కిసాన్ మేళాలో రైతులు, శాస్త్రవేత్తల చర్చా గోష్టి ఉంటుందని, దీనిలో భాగంగా నూనె గింజల పరిశోధనకు సంబంధించిన దర్శకుడు ఆర్‌కే మయూర్, ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్ కుమార్ విశ్వకర్మ, కన్వీనర్ కిషోర్ థాన, డిప్యూటీ సీఈవో రమేష్ హాజరవుతున్నట్లు తెలిపారు. నువ్వుల సాగు ప్రాముఖ్యతను రైతులకు వివరించడంతో పాటు, ఇతర నూనెగింజలైన ఆవాలు, కుసుమ, వేరుశనగ, సాగు గురించి వివరిస్తామన్నారు. సుమారు వెయ్యి నుంచి రెండువేల మంది ఈ మేళాకు రైతులు హాజరవుతున్నట్లు తెలిపారు.

విలువలతో కూడిన విద్య అందించాలి

రాయికల్, జనవరి 9: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని రాయికల్ ఎంఈవో ములస్తం గంగాధర్ అన్నారు. రాయికల్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు వారి పాఠశాలల్లో నిర్వహిస్తున్న వినూత్న కార్యక్రమాలు, తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ఆదర్శ బోధనా పద్ధతుల గురించి చర్చించారు. బోధనోపకరణాలను తయారు చేసి ప్రదర్శించారు. జిల్లా రిసోర్స్ పర్సన్ కడకుంట అభయ్ రాజ్, మహేష్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ కడుకుల రవీందర్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను తేలికగా తీసుకోవద్దు

- అన్ని నియోజకవర్గాల్లోనూ మెజార్టీ సాధించాలి
- ప్రతి అసెంబ్లీ నియోజకర్గ అభివృద్ధికి పదేసి కోట్లు
- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిల భేటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉమ్మడి జిల్లా నేతలు

కరీంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ఎవరూ తేలికగా తీసుకోవద్దని, గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవర్గాల పరిధిలో మెజార్టీ తీసుకురావడానికి కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్‌డీలో ముఖ్యమంత్రి మంగళవారం కరీంనగర్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాల వారీగా చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పది పార్లమెంట్ స్థానాలను గెల్చుకోవడం లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతున్నదని, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు తమ తమ నియోజకవర్గాల పరిధిలో పార్టీ అభ్యర్థులకు అత్యధిక మెజార్టీని సాధించేందుకు కృషి చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించవలసిన వ్యూహంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతలకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు నియోజకవర్గ అభివృద్ధి పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి 10 కోట్ల రూపాయలు కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రజల అవసరాలను గుర్తించి ఎమ్మెల్యేలు పనులను ప్రతిపాదించాలని, పార్టీ ఎమ్మెల్యేలు లేనిచోట నియోజకవర్గాల ఇన్‌చార్జిలు జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ప్రతిపాదనలు అందజేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అభివృద్ధి విషయంలో ఎలాంటి అలసత్వాన్ని, అవినీతిని ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి హెచ్చరించారని సమాచారం. ప్రజలకు సేవలం దించడంలో ఎమ్మెల్యేలు ముందుండాలని, ప్రజల్లోనే ఉంటూ వారి మన్ననలు పొందాలని సూచించారు. తాను కూడా వారంలో మూడు రోజులు ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను కలుస్తూ వారి నుంచి సమస్యలు తెలుసుకుంటానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

● నెలాఖరు నుంచి జిల్లాల వారీగా పర్యటనలు

ఈ నెల చివరి వారం నుంచి జిల్లాలవారీగా పర్యటనలు చేపడతానని ఈ సమావేశంలో ముఖ్యమంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాసనమండలి సభ్యుడు టి జీవన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, విజయరమణారావు, కరీంనగర్, హుజూరాబాద్, కోరుట్ల, సిరిసిల్ల నియోజకవర్గాల ఇన్‌చార్జిలు శ్రీనివాస్, ప్రణవ్ బాబు, జువ్వాడి నర్సింగరావు, కేకే మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఇతర కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్న కారణంగా మంత్రి శ్రీధర్‌బాబు ఈ సమావేశానికి హాజరుకాలేదని సమాచారం. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలిసి నెల రోజుల పరిపాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. తమ నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వినతిపత్రాలను ముఖ్యమంత్రికి అందజేశారు.

మాజీ మంత్రి కొప్పులను కలిసిన ఎంపీటీసీలు



కరీంనగర్‌లో ఎంపీపీ లక్ష్మికి మొక్కను అందజేస్తున్న కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, జనవరి 9: వెల్గటూర్ ఎంపీపీ లక్ష్మి, వైస్ ఎంపీపీ కవితలపై మండల పరిషత్ కార్యాలయంలో ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగి పోవడంతో మంగళవారం కరీంనగర్‌లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఎంపీటీసీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఎంపీపీ లక్ష్మికి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పొడేటి సత్తయ్య, ఎంపీటీసీలు గాజుల మల్లేశం, పెద్దూరి హారిక, మూగల రాజేశ్వరి, లక్కాకుల రాణి, ఎండపెల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు గూడ రాంరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎండపెల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింహాచలం జగన్, ఎండపెల్లి సర్పంచ్ మారం జలంధర్ రెడ్డి, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, మూగల సత్యం, పొడేటి రవి, లక్కాకుల శ్రీనివాస్, కిషోర్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో తాండ్ర్యాల హైస్కూల్

- పెచ్చులూడిపోయి ప్రమాదపుటంచున విద్యార్థులు
- అసౌకర్యాలతో అవస్థలు
- రు. 41 లక్షలు మంజూరైనా టెండర్లకు నోచుకోని వైనం


కథలాపూర్, జనవరి 9 : ప్రభుత్వాలు ఎన్ని మారినా చదువుల కోవెలలను మెరుగుపరచంలో పాలకులు తీవ్ర అలక్ష్యం ప్రదర్శిస్తున్నారు. విద్యాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని చెబుతున్నా ఆచరణలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్న క్రమంలో పాఠశాలల స్థితిగతులను మార్చడంలో పట్టించుకునే నాథుడే లేడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని తాండ్ర్యాల ఉన్నత పాఠశాల సుమారు 30 ఏళ్ల కిందట నిర్మించారు. పాఠశాల ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది.

● ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి

తాండ్ర్యాలలో ప్రాథమికోన్నత పాఠశాల కొనసాగింది. గత ఎనిమిది సంవత్సరాల కిందట ఉన్నత పాఠశాలకు అనుమతి రావడంతో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలుగా విడిపోయాయి. ఉన్నత పాఠశాలలో సుమారు 120 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కేవలం నాలుగు గదులు మాత్రమే ఉండగా అవి కూడా పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. రెండు గదులు రేకుల షెడ్డులో కొనసాగిస్తున్నారు. టీచర్ల కోసం స్టాఫ్ రూం కేవలం ఒకటే ఉండగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల సిబ్బంది ఇబ్బందితో కాలం వెళ్లదీస్తున్నారు. గత ప్రభుత్వం మన ఊరు మన బడి పథకం కింద రు. 41 లక్షలు మంజూరు చేసింది. అయితే టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదని తెలిసింది. దీంతో పాఠశాలల రూపు రేఖలు మారే అవకాశం కనుచూపు మేరలో కనిపించడం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఏడుగురు టీచర్లు పనిచేస్తుండగా గణితంకు సంబధించిన టీచర్ పోస్టు భర్తీ చేయడం లేదు. అటెండర్, రికార్డు అసిసెంట్ పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. వ్యాయామ ఉపాధ్యాయుడు కూడా లేక విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు.

● విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

దుమాల స్వామి, ప్రధానోపాధ్యాయుడు



పాఠశాల పూర్తిగా శిథిలావస్థలో ఉంది. ఉన్న నాలుగు గదులు కూడా ఇరుకుగా ఉన్నందు వల్ల తరగతుల నిర్వహణ కష్టంగా ఉంది. తాత్కాలికంగా రేకులతో రెండు తరగతి గదులు ఏర్పాటు చేశాం. పాఠశాల గ్రాంట్‌తో తరగతి గదులను మరమ్మతులు చేయించాం. మన ఊరు మన బడి నిధులతో పాఠశాల నిర్మిస్తే బాగుంటుంది.





శిథిలావస్థలో ఉన్న పాఠశాల..పెచ్చులూడిన తాండ్ర్యాల పాఠశాల

తపాల శాఖ ద్వారా ఆన్‌లైన్ సేవలు

సిరిసిల్ల టౌన్, జనవరి 9: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారెంటీలతోపాటు ఆన్‌లైన్ ద్వారా అన్ని సేవలు తపాల శాఖ అందిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ అధికారి దయానంద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆరు గ్యారెంటీల పథకం, రేషన్ కార్డు కోసం దరఖాస్తు, ఆధార్ కార్డులో చేర్పులు, మార్పులు, ఇతర ఆధార్ సంబంధిత సేవలను తపాల శాఖలో పొందవచ్చని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం ఇటీవల పెంచిన వడ్డీ రేట్లతో తపాల శాఖ చిన్న మొత్తాల పొదుపు పథకాలు ఆకర్షణీయంగా ఉన్నాయని తెలిపారు. జి ల్లా పరిధిలోని పది డిపార్ట్‌మెంట్ పోస్ట్ ఆఫీస్‌లతోపాటు 87 బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లలో స్పీడ్ పోస్ట్ బుకింగ్, ఎలక్ట్రానిక్ మనీ ఆర్డర్, పోస్టల్ రెవెన్యూ స్టాంప్ సేల్స్, పోస్టల్ ఇన్సూ రెన్స్, చిన్న మొత్తాల పొదుపు అందుబాటులో ఉన్నాయన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

కోనరావుపేట, జనవరి 9: తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని, రైస్ మిల్లర్ యజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ రోజువారి టార్గెట్‌ను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. మండలంలోని కోనరావుపేట, నిజామాబాద్, మర్తన పేట, కొలనూరు గ్రామాల్లోని రైస్ మిల్లర్లను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం కోనరావుపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా పాలన సంబంధించిన సమస్యలను దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్‌లో చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు రైస్ మిల్లర్లు ఎఫ్‌సిఐకి ఇవ్వాల్సిన రైస్‌ను టార్గెట్ పూర్తి చేయాలని, ఇందుకోసం రైస్ మిల్లులను తనిఖీ చేస్తూ జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

భగత్‌నగర్, జనవరి9: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 1,195 అదనపు బస్సులు నడిపిస్తున్నట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామన్నారు. జూబ్లీబస్‌స్టేషన్ నుంచి కరీంనగర్‌కు, తిరుగు ప్రయాణంలో కరీంనగర్ నుంచి జూబ్లీ బస్‌స్టేషన్‌కు అదనపు బస్సులు నడిపించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అదనపు బస్సులకు ఎలాంటి అదనపు ఛార్జీలు లేవని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందస్తు రిజర్వేషన్ కోసం ఆర్టీసీ వెబ్‌సైట్‌ను చూడాలని ఆర్ఎం సూచించారు.

ఎస్‌యూ డిగ్రీ పరీక్షల్లో 17 మంది డీబార్

గణేశ్‌నగర్, జనవరి 9: శాతవాహన విశ్వవిద్యాలయం డిగ్రీ ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 17 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. సెమిస్టర్-1లో వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో-3, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అగ్రహారంలో -4, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎస్‌కేఎన్‌ఆర్ జగిత్యాల లో-3, శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో-3, మూడో సెమిస్టర్‌లో ఎస్‌కె ఎన్‌ఆర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జగిత్యాలలో-1, వాగేశ్వరి డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ముగ్గురు డీబార్ అయినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 9: నగరంలోని ఓ భవనంలో పీవోపీ పనులు చేస్తున్న కార్మికుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడని కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపారు. హుస్సేనిపుర ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫరీద్‌ఖాన్(47) సాయినగర్‌లోని రాజాథియేటర్ ఎదుట ఒక భవనంలో పీఓపీ పనులు చేస్తున్న సమయంలో రెండో అంతస్తులోని విద్యుత్ వైర్‌ను మొదటి అంతస్తు నుంచి లాగుతున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఫరీద్‌ఖాన్ మృతి చెందాడు. మృతుడి కొడుకు లక్కీ ఖాన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చోరీపై విచారణ

కరీంనగర్ క్రైం, జనవరి9: కరీంనగర్‌లోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలోని రికార్డు గదిలో ఇటీవల గుర్తుతెలియని వ్యక్తి చొరబడి కొన్ని డాక్యుమెంట్లు చోరీ చేసినట్లు అనుమానిస్తున్న ఘటనపై మంగళవారం పోలీసులు విచారణ జరిపారు. సబ్ రిజిస్ట్రార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఒకటో ఠాణా పోలీసులు ఇప్పటికే కార్యాలయ ఉద్యోగుల వేలి ముద్రలను సేకరించగా కొందరు ఉద్యోగుల నుంచి సమాచారం సేకరించారు.

ఇటుకబట్టీలో బాలకార్మికుడు : కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, జనవరి 9: సిరిసిల్ల పట్టణంలోని రగుడు సమీపంలో గల అయ్యప్ప మణికంఠ స్వామి ఇటుక బట్టీ యజమాని జనగామ రాజేశ్వర్ రావుపై మంగళవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ ఉపేందర్ తెలిపారు. ఇటుకబట్టీల వద్ద వ్యాన్‌లో ఇటుకలను ఒరిస్సా ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలుడు లోడు చేస్తుండగా ఆపరేషన్ స్మైల్ రెస్క్యూ బృందం గుర్తించి బాలల సంరక్షణ సమితి ఎదుట హాజరుపరిచింది. ఈ మేరకు బాలకార్మికుడితో పనిచేయించిన యజమానిపై డిసిపియు ఉద్యోగి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని ఆయన తెలిపారు. ఓ జిన్నింగ్ మిల్లులోనూ బాలకార్మికుడు పనిచేస్తుండగా రెస్క్యూ బృందం గుర్తించి బాలల సంరక్షణ సమితికి అప్పగించారు.

ఆర్టీసీ బస్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

చందుర్తి, జనవరి 9: చందుర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ బస్టాండ్ వద్ద ఓ వృద్ధుడిని మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నక్క యోసెఫ్ అనే వృద్ధుడు బస్టాండ్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా వేములవాడ నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వృద్ధుడికి గాయాలయ్యాయి. గాయపడిన వృద్ధుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి ఎస్సై అశోక్ చేరుకొని విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి తీవ్రగాయాలు

గంభీరావుపేట, జనవరి 9 : గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామ సమీపాన మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన దోమ్మాట నాగరాజు, ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన కాసారపు కాశయ్యలు ద్విచక్ర వాహనంపై గంభీరావుపేట మండలం గోరంటాలలోని బంధువుల వద్దకు వచ్చి, తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. సముద్రలింగాపూర్ వద్ద వీరి ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో కాశయ్య తలకు, నాగరాజు కాలుకు తీవ్ర గాయాలయ్యాయి.

వీరిద్దరిని 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తీసుకెళుతుండగా, మార్గ మధ్యలో కాశయ్య మృతి చెందాడు. నాగరాజుకు కాలు విరిగి చికిత్స పొందుతున్నాడు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ మహేష్ పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాడు. .

నేడు వీరభద్రస్వామి కల్యాణం

● హాజరుకానున్న మంత్రులు పొన్నం, కొండా సురేఖ


శ్రీవీరభద్రస్వామి

భీమదేవరపల్లి, జనవరి 9 : కొత్తకొండ వీరభద్రస్వామి కల్యాణం బుధవారం కన్నుల పండువగా జరగనుంది. స్వామి వారి కల్యాణానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలు హాజరు కానున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. స్వామివారి కోనేరు పక్కన గల కల్యాణ మండపంలో స్వామివారి కల్యాణాన్ని అర్చకులు నిర్వహించనున్నారు. ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలు అందజేయనున్నారు. స్వామి వారి కల్యాణానికి చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయంతో పాటు కల్యాణం జరిగే మండపం వద్ద విద్యుదీకరణ పూర్తి చేశారు. కల్యాణానికి కొత్తకొండతో పాటు ముస్తాఫాపూర్, గట్లనర్సింగాపూర్, ఎర్రబెల్లి, మల్లారం, ముల్కనూర్, భీమదేవరపల్లి గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించనున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు జ్యోతి, కృష్ణవేణి, కృష్ణప్రసాద్ తదితరులకు కల్యాణ ఆహ్వాన పత్రికలు అందజేశామని, వారు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

అదుపు తప్పి ఆయిల్ ట్యాంకర్ బోల్తా

● ఎగిసిపడిన మంటలు.. పేలిన ట్రాన్స్‌ఫార్మర్ ● తప్పిన ప్రాణాపాయం

మెట్‌పల్లి, జనవరి, 9: మెట్‌పల్లి పట్టణ శివారులోని జాతీయ రహదారిపై వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ మంగళవారం వేకువజామున టైర్ పేలి అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ట్యాంకర్ నుంచి భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. మంటల ధాటికి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో మంటలు మరింత ఎక్కువయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది ఆరు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ నుంచి మల్లాపూర్ మండలంలోని రాఘవపేట గ్రామానికి ఆయిల్ ట్యాంకర్ బయలు దేరింది. వేకువజామున పట్టణ శివారులోని మూలమలుపు వద్దకు రాగానే ట్యాంకర్ టైర్ పేలి బోల్తా పడింది. వెంటనే డ్రైవర్ ట్యాంకర్ నుంచి దూకి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ట్యాంకర్‌కు ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. స్థానికులు గమనించి వెంటనే అగ్నిమాపక, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. మంటలు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు అంటుకోవడంతో అది పేలి మరింత ఎక్కువయ్యాయి. దీంతో సమీపంలో ఉన్న గు రుకుల పాఠశాల, పెట్రోల్ బంక్‌కు మంటలు అంటుకుని పెద్ద ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అగ్ని మాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్లతో శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంతో నిజామాబాద్, జగిత్యాల జిల్లాకు ప్రధాన రహదారి కావడంతో సుమారు రెండు కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఎస్సై చిరంజీవి కోరుట్ల, మల్లాపూర్ ఎస్సైల సహకారంతో వాహనాలను ఇబ్రహీంపట్నంలోని పలు గ్రామాల మీదుగా దారి మళ్లించారు. ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో మెట్‌పల్లి పట్టణంతో పాటు చుట్టు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సంఘటన స్థలాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరిశీలించారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, డీఎఫ్‌వో మురళీ మనోహర్, ఏఎఫ్‌వో భానుప్రసాద్ సిబ్బంది ఉన్నారు.


బోల్తాపడి మంటలు అంటుకున్న ఆయిల్ ట్యాంకర్

కాకతీయ కాలువకు నీటి విడుదల పెంపు

జగిత్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ ద్వారా సరఫరా చేస్తున్న నీటి విడుదలను మంగళవారం అధికారులు పెంచారు. ఇప్పటి వరకు మూడు వేల క్యూసెక్కుల నీటిని కాలువకు విడుదల చేస్తున్నారు. కొద్ది కొద్దిగా ఆరు వేల క్యూసెక్కులకు పెంపు చేస్తున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం డ్యామ్‌లో 66.526 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 8,162 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 6 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 250 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 502 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, వరద కాలువకు 2 వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ పథకాలకు 152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత యేడాది జూన్ ఒకటవ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 200.682 టీఎంసీల నీరు రాగా, 155.049 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు. యాసంగి పంట నీడి విడుదల ప్రణాళిక ప్రకారం ఈనెల 9వ తేదీ ఉదయం 8 గంటల నుంచి కాకతీయ కెనాల్ (ఎల్ఎండీ పైన) జోన్ -2 పరిధిలోని ఆయకట్టు వినియోగం కోసం 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని ఎస్సారెస్పీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ బాలికల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 9: ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామడుగు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో ఈ నెల 11న ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్స్ బాలికల ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణులను ఈ నెల 15 నుంచి 17 వరకు ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారిణులు ఉదయం 10 గంటలకు సంయుక్త కార్యదర్శి ఎన్ ప్రభాకర్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేశ్‌కు రిపోర్టు చేయాలని సూచించారు.

నేడు మానకొండూర్‌కు మంత్రి పొన్నం

మానకొండూర్, జనవరి 9 : రాష్ట్ర బీసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం మానకొండూర్ మండలంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్యాలండర్ ఆవిష్కరణ, నిజాయితీగూడెంలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం గంగిపల్లిలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ, ప్రారంభోత్సవాల కార్యక్రమంలో పాల్గొంటారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

చొప్పదండి, జనవరి 9: నవోదయ విద్యాయలంలో 2024-25 విద్యాసంవత్సరానికి 6వ తరగతి ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ మంగతా యారు ఒక ప్రకటనలో తెలి పారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు 7,105 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ ఆన్‌లైన్‌లో తమ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, హాల్ టికెట్ డౌన్‌లో డ్‌లో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే హెల్ప్‌లైన్ నెంబర్లలో సంప్రదించాలని పేర్కొ న్నారు. దరఖాస్తులో కులం, కేటగిరీ, అర్బన్, రూరల్, పుట్టిన తేదీ, జెండర్ నమోదులో తప్పిదాలు జరిగినట్లయితే అన్ని ఆధారాలతో ఈ నెల 16వ తేదీలోగా తమ విద్యాలయంలో సంప్రదించాలని, నవోదయలో సీటు ఇప్పిస్తామంటూ వచ్చే దళారుల మాట నమ్మి మోసపోవద్దని ఆమె తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో కుంకుమ పూజలు

మెట్‌పల్లి, జనవరి 9: మెట్‌పల్లి పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు ఘనంగా చేపట్టారు. మార్గశిర ధనుర్మాసం మంగళవారం సందర్భంగా పెద్దమ్మ ఆలయంలో సామూహిక సత్యనా రాయణ స్వామి, శ్రీ కాత్యాయని దేవి వ్రతాలు, కుంకుమ పూజలు ఆలయ పురోహితుడు మదన్‌శర్మ అంగరంగ వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం జరిపి లోక కళ్యాణార్థం ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవమూర్తులతో భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి ఆయలంలో ఏర్పాటు చేయగా సామూహిక వ్రతాలు, కుంకుమ పూజలను భక్తులచే జరిపించారు.

నియోజక వర్గంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దత్తత్రేయుని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపి, శ్రీఐశ్వర్యలక్ష్మి గోశాలలోని ఆవులకు ఆహారం అందజేశారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు

మల్యాల, జనవరి 9: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని మొ క్కులు తీర్చుకున్నారు. బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కొండగట్టులో భక్తుల రద్దీ

బద్దిపోచమ్మకు భక్తుల మొక్కులు


బద్దిపోచమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, జనవరి 9: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం తెల్లవారు జామునే అమ్మవారికి నైవేద్యం వండి బోనాలతో శివత్తుల నృత్యాలతో డప్పుచప్పుల్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరకున్నారు. నెత్తిన బోనాలతో భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఆలయంలోకి ప్రవేశించారు. అమ్మవారికి ఒడిబియ్యం పోసి నైవేద్యం సమర్పించారు. కళ్లసాకతో పాడి, పంట, పిల్లపాపలు చల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సూపరిండెంట్ హరిహరనాథ్ పర్యవేక్షించారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తుల అరెస్టు

ఇల్లందకుంట, జనవరి 9: అమాయక ప్రజలను బెదిరింపులకు గురిచేస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జమ్మికుంట రూరల్ సీఐ కొరె కిశోర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందకుంట మండలంలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి, మొగుళ్లపల్లి మండలంలోని గుండ్లకర్తి గ్రామానికి చెందిన రియాజ్, కుమారస్వామి, సురేష్‌లు స్నేహితులు. వీరు ఒక ముఠాగా ఏర్పడి అమాయక ప్రజలను బెదిరిస్తూ డబ్బులు, ఇవ్వాలని వేధిస్తుండేవారని చెప్పారు. వారి వేధింపులు భరించలేక బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, మరో వ్యక్తి సురేష్ పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు. ఎవరైనా అమాయక ప్రజలను బెదిరింపులకు గురిచేస్తే కేసులు తప్పవని సీఐ కిశోర్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ రాజకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండగట్టులో పార్కింగ్ ఇబ్బందులు

మల్యాల, జనవరి 9: కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చే భక్తుల వాహనాలకు సరైన పార్కింగ్ లేక తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారు. మంగళవారం వందలాది వాహనాల్లో వేలాదిగా భక్తులు తరలిరాగా కొండపైన, వైజంక్షన్ వద్ద ట్రాఫిక్ జాం ఏర్పడింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వై జంక్షన్ వద్ద వాహనాలు ఒకదాని వెనుక మరొకటి చిక్కుకొని ముందుకు వెళ్లడానికి నానా కష్టాలు పడ్డారు. పార్కింగ్, ట్రాఫిక్ జాంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

పొలం పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో మహిళ మృతి


మధుప్రియ(ఫైల్)

తంగళ్లపల్లి, జనవరి 9: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం తాడురులో మంగళవారం పొలం పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మల్లెబోయిన మధుప్రియ (28) అనే మహిళా రైతు మృతి చెందింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడూరు గ్రామానికి చెందిన రాకేశ్- మధుప్రియ దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం పొలంలో మధుప్రియతోపాటు మరో ఆరుగురు వరినాట్లు వేస్తున్నారు. ఈ క్రమంలో కర్ర సహాయంతో ఏర్పాటు చేసిన బోరు మోటార్‌కు వెళ్లే విద్యుత్ వైరు జారి పొలంలో పడింది. అక్కడే వరినాటు వేస్తున్న మధుప్రియ వైర్‌ను తొలగించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త రాకేశ్, కుమారుడు రిషిత్(8), రిషిత (6) ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మిడ్‌మానేరులో భూమి కోల్పోయి పేదరికం అనుభవిస్తున్న కుటుంబంలో ఇల్లాలు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్ గుర్రం రాజలింగంగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా అన్నకూటోత్సవం

కోరుట్ల, జనవరి 9 : పట్టణంలోని అతిపురాతనమైన వెంకటేశ్వర ఆలయంలో మంగళవారం అన్న కూటోత్సవ (తిరుప్పావడ సేవ) వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు బీర్నంది నరిసింహాచారి మత్రోచ్ఛరణ మధ్య ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస గద్య, విష్ణు సహస్రపారాయణం నిర్వహించి తిరుప్పావై సేవ కార్యక్రమాలను వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కూటోత్సవ కోసం తయారు చేసిన పులిహోరను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈవో విక్రం, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, ఆండాళ్ గోష్ఠి బృంద సభ్యులు పాల్గొన్నారు.


వైద్యంతో ప్రత్యేక అలంకరణ

రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు

డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి



రైతులకు చెక్కు అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి, జనవరి 9: రైతులకు సొసైటీ ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నట్లు కరీంనగర్ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి కోరారు. ధర్మపురి పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో సొసైటీ పరి ధిలో గల రైతులకు రూ. 4,00,000 దీర్ఘకాలిక రుణాలు సంబంధించిన చెక్కులను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు సొసైటీ ద్వారా పొందిన రుణాలు తిరిగి సకాలంలో చెల్లించాలని అన్నారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా సంఘం పరిధిలో గల రైతులకు వ్యవసాయ బావులు తవ్వి, విద్యుత్ మోటార్లు కొనుగోలు చేసి, పైపులైన్ ఏర్పాటు కోసం ఈ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. పంట పెట్టుబడి, చిరు వ్యాపారాలు, పశువులు, వాహనాలు కొనుగోలు కోసం కూడ రుణాలు అందించినట్లు ఆయన వివరించారు. రైతులు సొసైటీ ద్వారా పొందిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ శ్రీలక్ష్మీ, డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, ధర్మపురి పీఏసీఎస్ సీఈవో అయ్యోరు రాజేష్, రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఆన్‌లైన్ ప్రక్రియ

● దరఖాస్తులు 14762 ● 9300 ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి

పెగడపల్లి, జనవరి 9 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన అభయ హస్తం ఆరు గ్యారంటీల అమలుకు గాను స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ముమ్మరంగా నిర్వహిస్తున్న పెగడపల్లి ఎంపీడీవో జె.పుల్లయ్య తెలిపారు. మండలంలోని 23 గ్రామాలకుగాను గత నెల 28 నుంచి ఈ నెల 6 వరకు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలలో మొత్తం 14762 దరఖాస్తులు స్వీకరించగా మంగళవారం మధ్యాహ్నం వరకు 9300 దరఖాస్తులు ఆన్‌లైన్ నమోదు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు గాను 20 కంప్యూటర్లతో పాటు పంచాయతీ కార్యదర్శుల మొబైల్ ఫోన్ల ద్వారా మొత్తం 50 మంది సిబ్బందిని నియమించి షిఫ్టు పద్ధతిన యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు ఎంపీడీవో పుల్లయ్య తెలిపారు. కార్యక్రమాన్ని ఎంపీడీవోతో పాటు ఎంపీవో మహేందర్, చక్రధర్ గౌడ్ పర్యవేక్షిస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీలు

ఇబ్రహీంపట్నం, జనవరి 9: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ ఎంపీటీసీలు మంగళవారం బీఆర్ఎస్‌ని వీడి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంపీపీపై అవిశ్వాసం పెట్టి క్యాంపునకు వెళ్లిన వేములకుర్తి ఎంపీటీసీ దెశెట్టి మమత, యామాపూర్ బోరిగం ఎంపీటీసీ వివేకవర్ధిని, ఇబ్రహీంపట్నం1,2 తిమ్మని రాములు, పడాల మమత, వర్షకొండ ఎంపీటీసీ పోనకం టి వెంకట్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సంక్షేమ హక్కుల సాధన


బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు



నియామక పత్రాన్ని అందజేస్తున్న నల్ల వెంకటేశ్వర్లు

మెట్‌పల్లి, జనవరి 9 : సమష్టిగా ఉంటే బీసీ వర్గాల సంక్షేమ హక్కులను సాధించుకోవచ్చునని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్ల వెంకటేశ్వర్లు అన్నారు. బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడిగా నియామకమైన మంచాల శివకుమార్‌కు జాతీయ సంఘం అధ్యక్షుడు జాజాల శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ వర్గాల హక్కులను సాధించుకోవడానికి ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాజుల నాగరాజు, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాండభేరి నరేష్, బొమ్మల శంకర్, నేమూరి లక్ష్మయ్య, ఆవుల శ్రీకాంత్, మాచర్ల సదానందం, గంగోని సురేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాలకు కేంద్ర పథకాలు చేరాలని ప్రచారం



కొండ్రికర్లలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆకుల రాజగంగు

మెట్‌పల్లి రూరల్, జనవరి 9 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు చేరాలని ప్రచారం చేస్తున్నట్లు పార్టీ సీనియర్ నాయకుడు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండలంలోని కొండ్రికర్లలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు సంబంధించిన అంశాలను పొందుపరిచిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన సర్పంచ్, నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకుంటే దీని ద్వారా ఐదు లక్షల వరకు ఉచిత బీమా సౌకర్యం లభిస్తుందన్నారు. కిసాన్ నిధి ద్వారా రైతులకు సంవత్సరానికి రూ. 6 వేలు, ఉజ్వల గ్యాస్ ద్వారా సబ్సి డీ, పదేళ్ల వయసు గల బాలికలకు నెలకు రూ. వేయి డిపాజిట్ చేయడం ద్వారా 21 సంవత్సరాలకు రూ. 5లక్షలు తపాలా కార్యాలయం ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు గంట రాజేశ్వర్, కార్యదర్శి హేమలత, నాయకులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జీతాలు అందించాలని పారిశుధ్య కార్మికుల వినతి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

కోరుట్ల, జనవరి 9: రెండు నెలల నుంచి కార్మికులకు చెల్లించవలసిన జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ కు వినతి పత్రం అందించారు. ఈ నెల 11వ తేదీ వరకు చెల్లించవలసిన జీతాలు చెల్లించాలని లేకుంటే 12వ తేదీన విధులు బహిష్కరించి, దశల వారీగా ఆందోళన చేస్తామన్నారు. అధికారులు జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

అడ్డదారిలో ధాన్యం కేటాయింపు



● రైస్ మిల్ పూర్తి కాకుండానే ధాన్యం కేటాయింపు

● కరువైన అధికారుల పర్యవేక్షణ

● మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేసిన మాజీ ఉపసర్పంచ్

ఇబ్రహీంపట్నం, జనవరి 9: అడిగేందుకు ఎవరు ఉన్నారులే అనుకున్నాడో ఏమో కానీ ఓ (నాయకుడు) వ్యాపారి నిర్మాణంలో ఉన్న రైస్‌మిల్‌కు అడ్డదారిలో అలార్ట్‌మెంట్ చేసుకోని లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేందుకు సిద్ధమయ్యాడు.



మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న మాజీ ఉప సర్పంచ్

మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో రైస్ మిల్‌కు గ్రామానికి చెందిన వ్యక్తి ఇటీవలే లైసెన్స్ పొందాడు. రైస్‌మిల్ పనులు పూర్తి కాకుండానే సదరు వ్యాపారికి అధికారులు అలాట్‌మెంట్‌లు జారీ చేసి విమర్శలకు తావిచ్చారు.

ఇంకేముంది అటు అధికారులు, ఇటు వ్యాపారి జేబులు నింపుకునేందు కు సిద్ధమయ్యారని స్థానికుల నుంచి తీవ్ర విమర్శ లు వ్యక్తం అవుతున్నాయి. అసలు మిల్లింగ్ చేసేం దుకు కరెంట్ సప్లై లేకున్నా వేల క్వింటాళ్ల ధాన్యాన్ని ఆ రైస్ మిల్‌కు కేటాయించడం వెనుక ఉన్న అంతర్యమేమిటి అంటూ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ సల్లా సునీల్ ఏకంగా పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని సెక్రెటేరియట్‌లో కలిసి ఫిర్యాదు కూడా చేశారు. అదే విధంగా రాష్ట్ర కమి షనర్‌ను, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి సమస్యను వివరించారు. దీంతో అసలు విషయం వెలుగుచూసింది.

అన్నీ సక్రమంగా ఉన్న మిల్‌లకే సీఎంఆర్ కేటాయించాలని ఓ వైపు ప్రత్యేక సమావేశాలు పెట్టి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా అసలు ప్రారంభం కాని రైస్ మిల్‌కు సీఎంఆర్ కేటాయించడం ఏంటనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఓ కిరాణ కొట్టు పెట్టుకోవాలంటే సవాలక్ష పత్రాలు అడిగే అధికారులు లక్షల టన్నుల్లో ధాన్యం మిల్లింగ్ చేసే రైస్ మిల్‌ను నిర్మిస్తే మాత్రం అవేమి పట్టవన్నట్లుగా వ్యవహరించడమే కాకుండా మిల్ లేదు. మిషనరీలు నడిచేందుకు విద్యుత్ లేకున్నా చకచకా అలాట్‌మెంట్‌లు జారీ చేసి ధాన్యంను మిల్‌కు తరలించి నిల్వ చేయడం ఏంటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నాటి ప్రభుత్వ పెద్దల అండదండలతో ఆగమేఘాల మీద కోళ్ల ఫాంను తీసేసి ఫాంనే గోదాంగా మార్చివేశాడు ఆ లీడర్. అక్కడ అసలు గోదాం ఉందో లేదో అని చూడకుండానే అధి కారులు అలాట్‌మెంట్‌లు జారీ చేసి మరి అక్రమ వ్యాపారికి అండగా నిలిచారు అధికారులు. 2023కు సంబంధించి సీఎంఆర్ జనవరి 31 వరకు పూర్తి చేయాలని మంత్రి కలెక్టర్‌లకు, అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. కానీ ఇక్కడ మాత్రం విద్యుత్ సరఫరా కూడా లేకుండా మిల్లింగ్ ఎలా పూర్తి చేస్తారనేది మాత్రం ప్రశ్నార్థకమే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పరిశీలిస్తాం..: డీఎస్‌వో వెంకటేశ్వర్‌రావు

రైస్ మిల్ నిర్మాణం కాకుండా ధాన్యం అలాట్ చేయడంపై ఆంధ్రజ్యోతి వివరణ కోరగా అటువంటిది ఏమీ లేదని డీఎస్‌వో వెంక టేశ్వర్‌రావు తెలిపారు. అక్కడ నిర్మాణం జరుగుతున్న రైస్‌మిల్‌ను పరిశీలిస్తామని, మిల్ ప్రదేశంలో పూర్తిగా తనిఖీలు నిర్వహించిన తర్వాతనే చర్యలు తీసుకుంటామన్నారు.

ఎంపీపీ అవిశ్వాస ప్రక్రియకు బ్రేక్!

● హైకోర్టు స్టే జారీ చేసిందన్న ఎంపీపీ

● బీఆర్ఎస్, బీజేపీ ఎంపీటీసీలకు విప్ అందజేత

మల్యాల, జనవరి 9: మల్యాల ఎంపీపీ మిట్టపల్లి విమలపై అవిశ్వాసం ప్రకటిస్తూ ఎంపీటీసీలు ఇచ్చిన నోటీస్ నేపథ్యంలో జగిత్యాల ఆర్డీవో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంను వాయిదా వేయాలని మంగళవారం హైకోర్టు స్టే జారీ చేసినట్లు ఎంపీపీ విమల తెలిపారు. గత నెల 20న పది మంది ఎంపీ టీసీలు ఎంపీపీపై అవిశ్వాస నోటీస్‌ను ఆర్డీవోకు అందజేశారు. దీంతో గత పదిహేను రోజుల క్రితం ఎంపీటీసీలు క్యాంప్‌నకు తరలారు. అయితే ఆర్డీవో ఆదేశాల మేరకు అధికారులు బుధవారం సమావేశం ఏర్పాట్లు చేయగా మంగళవారం రాత్రి ఎంపీపీ విమల కలెక్టర్, ఆర్డీవో, ఎంపీడీవో ఇతర అధికారులకు స్టేకు సంబంధించిన సమాచారం అందించారు. దీంతో మండలంలో రాజకీయాలు రసకం దాయంలో పడినట్లు అయింది. అవిశ్వాసం ప్రకటించిన సభ్యులు ముందుగానే కేవియట్ ఉత్తుర్వులు తెచ్చినప్పటికీ మళ్లీ స్టే ఉత్తర్వులు రావడం చర్చనీ యంశంగా మారింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు బుధవారం నిర్వహించతలపెట్టిన సమావేశం వాయిదా వేయాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

● ఎంపీటీసీలకు విప్ జారీ..

ఇదిలా ఉంటే ఎంపీపీపై అవిశ్వాసానికి మద్దతు ఇవ్వకూడదని, సమావేశానికి హాజరుకావద్దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సత్యనారాయణరావు విప్ జారీ చేశారు. ఈ మేరకు పార్టీ ఎంపీటీసీలు ముదుగంటి వనిత, సంగని రవి, రాచర్ల రమేష్‌కు విప్‌లతో పాటు షోకాజ్ నోటీస్‌లను బీజేపీ నేతలు అందించారు. అలాగే బీజేపీ సభ్యులకు విప్ జారీ చేశారనే సమాచారంతో బీఆర్ఎస్ ఎంపీటీసీలకు ఆ పార్టీ విప్‌లు జారీ చేసింది. విప్ ధిక్కరించి సమావేశానికి హాజరైతే ఎంపీటీసీ సభ్యత్వం రద్దు చేయాల్సిందిగా ఆర్డీవోకు ఇచ్చిన విప్‌లో ఆయా పార్టీలు పేర్కొన్నాయి.

ఇంటింటా శ్రీరాముని అక్షింతలు పంపిణీ

ధర్మపురి, జనవరి 9: ధర్మపురి పట్టణంలోని 1, 9, 10వ వార్డుల్లో శ్రీరాముని అక్షింతలను ఇంటింటా మంగళవారం పంపిణీ చేశారు. రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు అయోధ్యలో అభిషేకంలో పూజించిన అక్షంతల వితరణ కార్యక్రమంలో భాగంగా వీహెచ్‌పీ నేతలు, సభ్యులు కరీంనగర్ ముదిరాజ్‌వాడ, గంపలవాడ, మామిడివాడ, ఇందిరమ్మకాలనీ, సారుగమ్మవీధిలో ఇంటికి వెళ్లి పంపిణీ శారు. ఈ సందర్భంగా మహిళలు కూడ మంగళ హారతులు పట్టుకుని స్వాగతం పలికి ఇంటింటికి వెళ్లి అక్షంతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రతి హిందు బంధువు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అలాగే మండలంలోని తీగలధర్మారం గ్రామంలో కూడ ఇంటింటా అక్షింతలు పంపిణీ చేశారు. శ్రీరామజన్మ భూమి తీర్థ యాత్ర ట్రస్ట్ సభ్యులు బండారి లక్ష్మణ్, పిల్లి శ్రీనివాస్, రంగు లక్ష్మి నరహరి, గాజు భాస్కర్, దుర్గప్రసాద్, కొమురయ్య, మూర్తి, రాజన్న, తిరుపతి, మల్లేష్ పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ మండలంలోని అలియా నాయక్ తండాలో అయోధ్య శ్రీ రామచంద్ర స్వామి అక్షింతలను మంగళవారం ఇంటింటికీ వెళ్లి వితరణ చేశారు. లోక కల్యాణాన్ని అక్షింతలు పెద్దల ఆశీర్వచనాలై వర్ధిల్లి తండ్రి మాట జవదాటని శ్రీరాముని పాలనాదార్శకత, సీతమ్మ పవిత్రత ఈ లోకానికి ఆదర్శప్రాయంగా ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ శృతి కార్యక్రమాన్ని నిర్వహించామని గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లావుడ్య నందు నాయక్, సురేష్, మహేష్, వసంత, రాజేష్, శ్రీకాంత్, మదన్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురిలో ఇంటింటికీ పంపిణీ చేస్తున్న రాములోరి అక్షింతలు

రామయ్య అక్షింతలు అందుకోవడం అదృష్టం

జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్

జగిత్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామయ్య అక్షింతలు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జడ్పీ క్యాంపు కార్యాలయంలో అయోధ్య నుంచి వచ్చిన రాముని అక్షింతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. శ్రీరాముల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థిస్తున్నానన్నారు. ఈకార్యక్రమంలో పలువురు రామ భక్తులు పాల్గొన్నారు.

ఆకతాయిల ఆగడాలను అరికట్టాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 9: సిరిసిల్ల పట్టణ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలు, పాతబస్టాండ్ ప్రాంతాలలో విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేసే ఆకతాయిలపై నిఘా పెంచాలని బీఆర్ ఎస్వీ నాయకులు కోరారు. మంగళవారం సిరిసిల్ల పట్టణ సీఐ ఉపేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల సమయం లోనూ, పాత బస్టాండ్‌లోనూ సాయంత్రం కొంత మంది ఆకతాయిలు వెకిలి చేష్టలకు పాల్పడుతున్నారన్నారు. పోలీస్ శాఖ ఆకతాయిలపై మరి కొంత నిఘా పెంచి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సీఐ ఉపేందర్ మాట్లాడుతూ షీ టీమ్స్, బ్లూ కోల్ట్స్ గస్తీ పెంచుతామన్నారు. బీఆర్ఎస్వీ నాయకులు శ్రీనివాస్, నవీన్, తిరుపతి, జగన్, సందీప్, నరేష్, భాను, కిరణ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

- అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులందరికి ఓటు హక్కు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులు, విద్యా సంస్థల నిర్వాహకులతో ఓటరు నమోదు కార్యక్రమం, లిటరసీ క్లబ్ నిర్వహణ తదితర అంశాలపై జూమ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆమె మాట్లాడారు. పల్లెలు, పట్టణాలు, విద్యా సంస్థలల్లో ఓటరు నమోదుపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో స్వీప్ నోడల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

ఆదాయాన్ని కోడెలకు ఖర్చు చేయాలి

వేములవాడ టౌన్, జనవరి 9 : వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో కోడెమొక్కుల ద్వారా వచ్చే ఆదాయాన్ని కోడెల నిర్వహణకే ఖర్చు చేయాలని వీహెచ్‌పీ క్షేత్రం యాదగిరిరావు అన్నారు. రాజన్న ఆలయ గోశాలను మంగళవారం పరిశీలించి ఏఈవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరిరావు మాట్లాడుతూ రాజన్న ఆలయానికి ఏటా కోడెమొక్కుల ద్వారా సుమారు రూ.20 కోట్ల పైబడి ఆదాయం వస్తోందని, గోశాల నిర్వహణకు కనీసం రూ.కోటి ఖర్చు చేయడం లేదని అన్నారు. కోడెలు మృత్యువాత పడిభక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. తెలంగాణ గోరక్షణ అధ్యక్షుడు వెంకన్న, రాధాకృష్ణ, గడప కిషోర్‌రావు ఉన్నారు.

విద్యార్థులు జ్ఞాపక శక్తి పెంచుకోవడానికి చెకుముకి

మెట్‌పల్లి, జనవరి, 9 : విద్యార్థులు తమ జ్ఞాపక శక్తి పెంచుకోవడానికి చెక్ ముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ఎంతో ఉపయోగ పడుతుందని మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. జన విజ్ఞాన వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే చెక్ ముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ సంబంధించిన గోడ పత్రికను సీఐ ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు తులసి ఆగమయ్య మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్‌తో పాటు వివిధ యాజమాన్యాల కింద పని చేసే విద్యా సంస్థల్లో చదువుకుంటున్న 8, 9, 10వ తరగతుల విద్యార్థులు నిర్వహించే ప్రతిభ పరీక్ష రాయవచ్చునన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తామన్నారు. పరీక్షలను పాఠశాల స్థాయిలో ఈనెల 19న, మండల స్థాయిలో 27న, జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 3న, రాష్ట్ర స్థాయి సంబరాలు ఫిబ్రవరి 9 నుంచి 11 వరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తామన్నారు.

సాగు నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జనవరి 9: సాగు నీటి కోసం రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి మండలంలోని కమలాపూర్ సమీపంలో గల బోల్‌చెరువు ప్రధాన కాలువను సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. కాలువలో పెరిగి ఉన్న పిచ్చి మొక్కలు, పేరుక పోయిన మట్టిని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతులకు కాలువల పరిస్థితి ఇలాగే ఉంటే రబీ సీజన్‌లో పంట పొలాలకు నీరందించడంలో ఇబ్బందులు ఉంటాయన్నారు. బోల్‌చెరువు కింది ప్రధాన కాలువ ద్వారా నీరందించే సాగు విస్తీర్ణం, రైతులు పడుతున్న ఇబ్బందులు, సమస్యలు గురించి ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో ఈ కాలువ కింద ఉన్న కమలాపూర్, తిమ్మాపూర్, బూరుగుపల్లె, రామయ్యపల్లె, రాయపట్నం గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలకు సక్రమంగా నీరందించే విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సాగు నీరు విషయంలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుక వస్తే వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారం దిశగా ముందుకు సాగుతానని ఆయన తెలిపారు. ధర్మపురి పక్కనే గోదావరి నది ఉన్నా, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నియోజకవర్గ పరిధిలో రైతాంగానికి సాగు నీరందని దుస్థితి నెలకొందని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఇటీవల కలిసి రైతుల సమస్యలు, కాలువల దుస్థితి గురించి వివరించానని తెలిపారు. సీఎం స్పందించి వెంటనే విచారణ జరిపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు. చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట ఇరిగేషన్ శాఖ ఎస్ఈ అశోక్‌కుమార్, ఈఈ నారాయణరెడ్డి, డీఈఈ ధర్మకుమార్ ఏఈ ఈలు ప్రవీణ్, మహేష్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహ రాజు ప్రసాద్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, మైనార్టీ అధ్యక్షులు ఎండీ రఫియొద్దీన్, తిమ్మాపూర్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ నలుమాసు వైకుంఠం, లింగాల హరీష్‌గౌడ్, బోండ్ల పోచమల్లు, బొమ్మకంటి సంతోష్, తోడేటి ప్రకాష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గొల్లపల్లి, జనవరి 9: గొల్లపల్లి మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యాసంవత్సరానికిగాను 6 నుంచి 12 తరగతులకు ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో కొత్తగా 100 సీట్లన భర్తీ చేస్తామని, 7వ తరగతి నుంచి 10వ తరవరకు వరకు ఖాళీలు ఉంటే కొత్త విద్యార్థులను తీసుకుంటామని తెలిపారు. అందుకు ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొగి పురుగు నివారణపై అవగాహన

కొడిమ్యాల, జనవరి 9 : కొడిమ్యాల గ్రామ శివారులో వరి నాటు వేస్తున్న రైతులకు మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం బాబు జగ్‌జీవన్‌రాం వ్యవసాయ కళాశా ల జిల్లెలలోని ఫైనల్ ఈయర్ విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో బాగంగా మొగి పురుగును గుడ్ల దశలో నివా రించుటకు తీసుకోవాలిసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కలిపించారు. ఆకు కొన కోత పద్ధతిని పాటించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు శ్రీకాంత్, రేవంత్, సా యికిరణ్, రాజ్‌కుమార్, సంతోష్ ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

మల్లాపూర్, జనవరి, 9 : మండలంలోని గొర్రెపెల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచు కొంపల్లి సరోజన, క్లబ్ రీజినల్ చైర్మన్ శివశ్రీనివాస్ ప్రారంభించారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 45మంది కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశామన్నారు. అందులో 31 మందికి ఆపరేషన్ నిమిత్తం రేకుర్తి కంటి ఆసపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ రీజినల్ చైర్మన్ శివ శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ కరీంనగర్ పట్టణంలోని రెడ్ క్రాస్ బిల్డింగ్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు మూడు రూ. 3కోట్లతో సీటీ స్కాన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గంగానర్సయ్య, లయన్స్ క్లబ్ అధ్య క్షుడు కనుక సంజీవ్, కార్యదర్శి తోట రాజిరెడ్డి, కోశాధికారి జైపాల్‌రెడ్డి, పీఆర్‌వో ముత్యాల రమేష్, సభ్యులు మోర సతీష్, రాజు, ధనుష్, రాజేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లిని కలిసి జువ్వాడి

కోరుట్ల, జనవరి 9 : మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారా యణను మంగళవారం కోరుట్ల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు మర్యాద పూర్వకంగా కలిసారు. హైదరాబాదులోని కాంగ్రెస్ లేజిస్లేచర్ పార్టీ (సిఎల్‌పీ) కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు వాలువాలతో సత్కరించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కొడిమ్యాల, జనవరి 9 : మండల కేంద్రంలో నిర్మించిన శ్రీలక్ష్మీవేంక టేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ఓమన్‌లో ఉంటున్న మండల కేంద్రానికి చెందిన వేముల ప్రసాద్ సరస్వతి దంపతులు మంగళవారం 25వేల 116 రూపాయలను ఆలయ పూజారి నాగరాజు రమేష్‌కు పంపారు. దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి జాతర

మెట్‌పల్లి రూరల్, జనవరి, 9 : మండలంలోని సత్తక్కపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింభహస్వామి ఆలయం జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం గ్రామంలోని ఆలయానికి ఉదయం నుంచి భక్తుల తాకిడి పెరిగింది. జాతర ఉత్సవంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సం దర్భంగా కోరట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొనగా గ్రామంలోని మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆయన స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, మేడిపల్లి సర్పంచు పీసు తిరుపతిరెడ్డి, నాయకులు, పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులు కల్పించాలి

రాయికల్, జనవరి 9: రాయికల్ పట్టణ ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వసతులు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం వైద్య విధాన పరిషత్ సూపరింటెండెంట్ సుదక్షిణా దేవికి విన్నవించారు. ఆస్పత్రిలో సరిపడా మందులు లేవని, వైద్యులను త్వరగా నియమిం చాలని కోరారు. మ్యాకల రమేష్, కొయ్యడి మహిపాల్‌రెడ్డి, ఎర్దండి దివాకర్‌రెడ్డి, మహమ్మద్ షాకీర్, కడకుంట్ల నరేష్, బత్తిని భూమయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

వనభోజనాలకు విద్యార్థులు

కథలాపూర్, జనవరి 9 : మండలంలోని బొమ్మెన ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మంగళవారం పిక్నిక్ (వనభోజనాలు)కు వెళ్లారు. గ్రామ సమీపంలోని పెద్దవాగులోకి వెళ్లి సామూహిక భోజనాలు చేసి ఆహ్లాద వాతావరణంలో గడిపారు. ఆటా, పాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంఈవో ఆనందరావు మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు పిక్నిక్‌కు వెళ్లడం అవసరమేనని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు మధు, ఉపాధ్యాయులు గంగాధర్, ఖలీద్‌పాషా, శ్రీధర్, నవిత, రాజేశ్ తదితరులు ఉన్నారు.